క్లుప్తంగా

జల వనరుల పరిశుభ్రతకు ఈపీటీఆర్‌ఐతో ఒప్పందం



ఎంఓయూ పత్రాలను అందజేస్తున్న డాక్టర్ స్వరాజ్

గచ్చిబౌలి: సిద్దిపేట మున్సిపాలిటీలో జల వనరుల పరిశుభ్రతకు ఈపీటీఆర్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. మంగళవారం ఈపీటీఆర్‌ఐ ఇన్నోవేషన్ ఇంక్యుబేటర్ హబ్ హెడ్ డాక్టర్ జె.స్వరాజ్, సిద్దిపేట పట్టణం 39 వార్డు కౌన్సిలర్ బోనగిరి దీప్తి నాగరాజు అవగాహన ఒప్పందం పత్రాలపై సంతకాలు చేశారు. డాక్టర్ స్వరాజ్ మాట్లాడుతూ.. అత్యంత ఆక్రమణ జాతులకు చెందిన గుర్రపు డెక్క నీటి వనరులకు ఇబ్బంది కల్గిస్తుందన్నారు. గుర్రపు డెక్కను తొలగించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మధుచంద్రిక చటోపాధ్యాయ, రైసుద్దీన్, శేఖర్ బాబు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కేటీఆర్‌ను కలిసిన భూపాల్‌రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ వెన్నవరం భూపాల్‌రెడ్డి మంగళవారం మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్‌గా తనకు అవకాశం ఇచ్చినందుకు మర్యాదపూర్వకంగా మంత్రి కేటీఆర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపినట్లు చెప్పారు.

గండిమైసమ్మ ఎక్స్‌రోడ్ వయా గచ్చిబౌలి టు అప్పాకు బస్సు సౌకర్యం

రాయదుర్గం: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని గండిమైసమ్మ ఎక్స్‌రోడ్ నుంచి వయా గచ్చిబౌలి మీదుగా అప్పా వరకు నూతన బస్సు సౌకర్యాన్ని ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేశారు. బుధవారం నుంచి గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ ఆర్టీసీ డిపో నుంచి ఈ బస్సు సౌకర్యాన్ని కల్పిస్తున్నారు. ప్రతినిత్యం నాలుగు సిటీ ఆర్డినరీ బస్సులను నడపాలని నిర్ణయించారు. 221 జీఎం బస్సు నంబర్ పేరిట ఉదయం బస్సు 6:40గంటలకు ప్రారంభమై రాత్రి 9:15 గంటల వరకు మొత్తం 40 ట్రిప్పులను నడుపుతున్నామని డిపో మేనేజర్ శ్రీనివాస్ తెలిపారు. గండి మైసమ్మ ఎక్స్‌రోడ్‌లో ప్రారంభమయ్యే ఈ బస్సు మియాపూర్ మీదుగా గచ్చిబౌలి వరకు అక్కడి నుంచి నార్సింగి మీదుగా అప్పా వరకు కొనసాగుతుంది. అప్పాలో బయలుదేరే బస్సు నార్సింగి, గచ్చిబౌలి, మియాపూర్ మల్లంపేట్, బౌరంపేట్ మీదుగా గండిమైసమ్మ ఆలయం ఎక్స్‌రోడ్ వరకు నడుస్తుందన్నారు.

మరుగుదొడ్ల నిర్మాణాన్ని నిలిపివేయాలి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఉస్మాన్‌నగర్‌లో వాటర్‌ట్యాంక్ వద్ద నిర్మిస్తున్న మరుగుదొడ్ల నిర్మాణాన్ని నిలిపివేయాలని కోరుతూ మాజీ ఉపసర్పంచ్ పర్వా శ్యాంరావు ఆధ్వర్యంలో మున్సిపల్ అధికారులకు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉస్మాన్‌నగర్‌లో ఇళ్ల మధ్యలో వాటర్‌ట్యాంక్‌కు ఆనుకొని మరుగుదొడ్లను నిర్మించడం ద్వారా తాగునీరు కలుషితమయ్యే అవకాశం ఉంటుందన్నారు. దీంతో మరుగుదొడ్ల నిర్మాణాలను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు.


బోనాల ఉత్సవాలకు ఏర్పాట్లు

పటాన్‌చెరు టౌన్: ఈ నెల 13న నిర్వహించనున్న బోనాల సందర్భంగా భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేస్తున్నామని కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని గోనెబస్తీ, ముదిరాజ్ బస్తీ, సీతారాంపురం, బండ్లగూడ భూపాల్‌రెడ్డి కాలనీలోని సాయిగణేష్ కాలనీలోని పోచమ్మ దేవాలయం ఆవరణల్లో పారిశుధ్య పనులు చేయించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ శివకుమార్ వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేష్ పాల్గొన్నారు.

పేదలకు వరం సీఎంఆర్‌ఎఫ్

- ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

జిన్నారం(పటాన్‌చెరు): పేదలకు వరం సీఎంఆర్‌ఎఫ్ అని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. గుమ్మడిదల మండలంలోని కానుకుంట గ్రామానికి చెందిన కీర్తనకు ప్రభుత్వం ద్వారా మంజూరైన రూ.1.50లక్షల విలువచేసే ఎల్‌ఓసీ పత్రాలను మంగళవారం ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి కీర్తన కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కుమార్‌గౌడ్, నాయకులు విజయభాస్కర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాజశేఖర్ పాల్గొన్నారు.



బోనం.. ఘనం



పూజల్లో ఎమ్మెల్యే గాంధీ, మాజీ కార్పొరేటర్ సాయిబాబా, ఆలయ కమిటీ సభ్యులు



అమ్మవారికి పూలు, పండ్లతో అలంకారం

- భక్తిశ్రద్ధలతో బోనాల వేడుకలు
- మొక్కలు తీర్చుకున్న భక్తులు

రాయదుర్గం: ఆషాఢ బోనాలను గచ్చిబౌలి డివిజన్‌లోని మధురానగర్‌లో మంగళవారం నిర్వహించారు. నిజాం కాలం నాటి చరిత్ర కలిగిన ఎదురుగడ్డమైసమ్మ ఆలయంలో బోనాల వేడుకలను నిర్వహించారు. ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు భక్తులు తమ బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకోవడానికి అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఎదురుగడ్డమైసమ్మ ఆలయంలో అమ్మవారిని ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు చేసిన అనంతరం ప్రత్యేక అలంకారంతో భక్తులకు దర్శనం చేసుకొనే అవకాశం కల్పించారు. గచ్చిబౌలి, ప్రశాంత్‌హిల్స్, మధురానగర్, రాయదుర్గం, ఖాజాగూడ వంటి ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్న అమ్మవారిని దర్శించుకున్నారు. కాగా ప్రభుత్వవిప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ, గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టిసాయిబాబా, ఆలయ కమిటీ సభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు వారిని ఘనంగా సత్కరించారు. సాయంత్రం మధురానగర్ నుంచి అమ్మవారి ఆలయం వరకు పోతురాజు విన్యాసాలతో తొట్టెల ఊరేగింపు కోలాహలంగా నిర్వహించారు. అనంతరం అమ్మవారికి తొట్టెలను సమర్పించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

పూలు, పండ్లతో అమ్మవారికి అలంకారం..

ఆషాఢమాసం బోనాల ఉత్సవాల్లో భాగంగా మధురానగర్‌లోని ఎదురుగడ్డ మైసమ్మ అమ్మవారికి ప్రత్యేక అలంకారం చేశారు. ముఖ్యంగా ఆలయంలో ఉదయం అమ్మవారికి పండ్లు, పూలతో ప్రత్యేక అలంకారం చేశారు. ఆలయ కమిటీ పర్యవేక్షణలో అర్చకులు ఈ అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు.

ఘనంగా ప్రపంచ జనాభా దినోత్సవం



ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆశా వర్కర్లను సన్మానిస్తున్న దృశ్యం

శేరిలింగంపల్లి: అర్హులైన ప్రతిఒక్కరూ కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటించి దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామియాదవ్ పేర్కొన్నారు. మంగళవారం ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకొని శేరిలింగంపల్లి ఆదర్శనగర్‌లో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జనాభా దినోత్సవం సందర్భంగా కుటుంబ నియంత్రణ, కుటుంబ సంక్షేమానికి కృషి చేసే ఆశా వర్కర్లను సత్కరించారు. ఈ సందర్భంగా రామస్వామియాదవ్ మాట్లాడుతూ.. అధిక జనాభాతో పేదరికం, నిరుద్యోగం, వనరుల కొరత ఆహార కొరత, విద్య, వైద్యం అందరికీ అందుబాటులో లేక జీవన ప్రమాణ స్థాయి తగ్గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు మల్లారెడ్డి, సాంబశివగౌడ్, జనార్దన్‌రావు, విష్ణుప్రసాద్, శివరామకృష్ణ, బాలన్న పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

హఫీజ్‌పేట్: రామకృష్ణనగర్‌లో సుమారు రూ.30 లక్షలతో సీసీ రోడ్లు నిర్మిస్తున్నామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. మంగళవారం తెల్లవారు జామున డివిజన్ పరిధిలోని రామకృష్ణనగర్‌లో చేపట్టిన అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని రంగాల్లో డివిజన్‌ను అభివృద్ధి చేసి ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామన్నారు. రామకృష్ణనగర్ కాలనీలో సీసీ రోడ్లు నిర్మించడం చాలా సంతోషకరమన్నారు. కాలనీని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేశామని, అసంపూర్తిగా మిగిలిపోయిన పనులను పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ ప్రశాంత్, బీఆర్‌ఎస్ నాయకులు, కాలనీవాసులు విష్ణువర్ధన్‌రెడ్డి, రసూల్, కృష్ణరావు, రాము, గాంధీ, మోహన్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్ల పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ

ఏడు ఎస్‌టీపీలకు నిధులు మంజూరు



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

గచ్చిబౌలి: శేరిలింగంపలి నియోజకవర్గంలో ఏడు ఎస్‌టీపీలకు నిధులు మంజూరయ్యాయని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. మంగళవారం పాలపిట్ట పార్క్ వద్ద రూ.15.30 కోట్ల అంచనాతో 7ఎంఎల్‌డీ సామర్థ్యం గల ఎస్‌టీపీ పనులను కార్పొరేటర్ షేక్ హమీద్‌పటేల్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జీహెచ్‌ఎంసీ పరిధిలో 772 ఎంఎల్‌డీ సీవరేజ్ ప్లాంట్లకు అదనంగా 1260 ఎంఎల్‌డీ సీవరేజ్ ప్లాంట్లు, రూ.3866.21 కోట్ల నిధులకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. 31 ప్రాంతాల్లో ఎస్‌టీపలను ఏర్పాటు చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. మియాపూర్ పటేల్ చెరువులో 7 ఎంఎల్‌డీ, గంగారం చెరువులో 20 ఎంఎల్‌డీ, దుర్గం చెరువులో 7 ఎంఎల్‌డీ, ఖాజాగూడ చెరువులో 21 ఎంఎల్‌డీ, అంబీర్ చెరువులో 37 ఎంఎల్‌డీ, ఎల్లమ్మకుంటలో 13.50 ఎంఎల్‌డీ, పరికి చెరువులో 28 ఎల్‌ఎల్‌డీ కెపాసిటీ కలిగిన ఎస్‌టీపీ ప్లాంట్ల నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయని వివరించారు. మంత్రి కేటీఆర్ సహకారంతో మురుగు నీటి శుద్ధికి అత్యంత ప్రాధాన్యమిస్తున్నారని తెలిపారు. అనంతరం కొండాపూర్ డివిజన్‌లోని శ్రీరాంనగర ఏ బ్లాక్‌లో యూజీడీ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్ సందీప్, బీఆర్‌ఎస్ నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్‌యాదవ్, ఊట్ల కృష్ణ, చాంద్ పాషా, బలరాం, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

కాలనీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని వెంకటేశ్వరనగర్ 35 బ్లాక్ కాలనీలో సీసీ కెమెరాల ఏర్పాటుకు రూ.9లక్షల ఎమ్మెల్యే నిధులతో, రూ.3 లక్షల కాలనీ నిధులు ఖర్చు చేశారు. మంగళవారం మొత్తం 60సీసీ కెమెరాలను సీఐ క్రాంతికుమార్‌తో కలిసి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ.. కాలనీలో నేరాల అరికట్టడానికి సీసీ కెమెరాలు ఎంతగానో తోడ్పడతాయని అన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు కాలనీవాసులు ముందుకు రావటం అభినందనీయమన్నారు. శాంతి భద్రతలు కాపాడటానికి పోలీస్ అధికారులు ఎంతగానో కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు వారు విస్తృతమైన ప్రచారం చేశారని తెలిపారు. అన్ని కాలనీవాసులు ఈ విధంగా ముందుకు వచ్చి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఏ చిన్న సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకువస్తే అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, డివిజన్ పార్టీ అధ్యక్షుడు సంజీవ రెడ్డి, నాయకులు చంద్రకాంత్‌రావు, హరినాథ్, ఆంజనేయులు, లక్ష్మీ నర్సయ్య, చంద్రమోహన్‌సాగర్, శ్రావణిరెడ్డి, శివసాగర్, సంపత్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

జీహెచ్‌ఎంసీకి కలెక్టర్ గెస్ట్‌హౌస్ అప్పగింత



ఉప కమిషనర్‌కు పత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, ఆర్డీఓ రవీందర్ రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పట్టణంలోని రామచంద్రారెడ్డినగర్ కాలనీలోని కలెక్టర్ గెస్ట్‌హౌస్‌ను మంగళవారం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సమక్షంలో జీహెచ్‌ఎంసీకి అప్పగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో వెన్నవరం రాజేశ్వర్ రెడ్డి సర్పంచ్‌గా ఉన్న సమయంలో ప్రజల అవసరాలకు గెస్ట్‌హౌస్‌ను నిర్మించారన్నారు. అనంతరం ఈ భవనం కలెక్టర్ ఆధీనంలో ఉండటంతో వినియోగించుకోలేకపోయారన్నారు. పటాన్‌చెరుకు వచ్చిన మంత్రి హరీశ్‌రావు దృష్టికి రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ భూపాల్ రెడ్డితో కలసి ఈసమస్య తీసుకువెళ్లినట్లు చెప్పారు. ఆయన వెంటనే స్పందించి సమస్యను పరిష్కారించాలని కలెక్టర్‌ను ఆదేశించారన్నారు. కలెక్టర్ గెస్ట్‌హౌస్ అప్పగించే అనుమతి పత్రాలను ఎమ్మెల్యే, ఆర్డీఓ రవీందర్ రెడ్డి చేతుల మీదగా జీహెచ్‌ఎంసీ రామచంద్రాపురం సర్కిల్ ఉప కమిషనర్ బాలయ్యకు అందించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పుష్పనగేష్, సింధు ఆదర్శ్‌రెడ్డి, తహసీల్దార్ జయరాం తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం



సాక్షి, సిటీబ్యూరో: ఎన్టీఆర్ ట్రస్ట్ సౌజన్యంతో విజేత సూపర్ మార్కెట్ కార్పొరేట్ ఆఫీస్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. రక్తదాతలకు విజేత సూపర్ మార్కెట్స్ ఎండీ మురకొండ జగన్మోహనరావు సర్టిఫికెట్లు అందజేసి రక్తదాతలని అభినందించారు. ఈ కార్యక్రమములో విజేత ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సందీప్ చౌదరి, మార్కెటింగ్ డైరెక్టర్ సిద్దార్థ్ చౌదరి పాల్గొన్నారు.



గడపగడపకూ బీజేపీ ప్రజాయాత్ర

మియాపూర్: ప్రభుత్వ ఉద్యోగులకు ఫస్ట్ తేదీన ఇవ్వాల్సిన జీతాలు ఇవ్వలేని దౌర్భాగ్య స్థితిలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్‌యాదవ్ పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని పీఏనగర్‌లో పాదయాత్ర చేపట్టారు. సమస్యలను తీర్చకపోగా మరొక్కసారి మాయమాటలు చెప్పి అధికారంలోకి రావాలని చూస్తున్న ప్రభుత్వాన్ని ప్రజలు గ్రహిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ రాఘవేంద్రరావు, నవతా రెడ్డి, రామ్‌రెడ్డి, వినోద్‌రావు, గణేష్ ముదిరాజ్, రాజేష్‌గౌడ్, వెంకటేష్, శివరాజ్, శ్రీనివాస్, రాము, గోపీ తదితరులు పాల్గొన్నారు.

'ఆరు నెలల్లో వాహనాల కోసం సంప్రదించకపోతే వేలం వేస్తాం'

రాయదుర్గం: సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో స్వాధీనం చేసుకున్న వాహనాల కోసం వాహనదారులు పోలీసులను ధ్రువపత్రాలతో సంప్రదించకపోతే వేలం వేస్తామని సైబరాబాద్ పోలీసులు స్పష్టం చేస్తున్నారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. సైబరాబాద్ పరిధిలో 539 వాహనాలను స్వాధీనం చేసుకొని మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ గ్రౌండ్‌లో ఉన్నాయని పోలీసులు తెలిపారు. ఈ వాహనాల వివరాలను సైబరాబాద్ వెబ్‌సైట్ www.cyberabadpolice.gov.inలో పొందుపరిచినట్లు పేర్కొన్నారు. అభ్యంతరాలు ఉన్న యజమానులు వాటిని తిరిగి పొందేందుకు సంబంధిత పోలీస్ స్టేషన్‌లోని ఎస్‌హెచ్‌ఓను కలిసి మీ వాహనానికి సంబంధించిన డాక్యుమెంట్లను ఆరు నెలల కాలపరిమితి లోపు సంప్రదించాలి. వివరాలకు ఎంటీఓ ఎన్. విష్ణు(94905 17317) లో సంప్రదించాలని కోరారు.

డ్రంకన్ అండ్ డ్రైవ్‌లో జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకన్ అండ్ డ్రైవ్‌లో పట్టు బడ్డ వాహనదారులకు సంగారెడ్డి కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..ఆది, సోమవారాల్లో నిర్వహించిన డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో 17 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను మంగళవారం సంగారెడ్డి కోర్టులో హాజరు పర్చగా జడ్జి 15 మందికి ఒక్కొక్కరికీ రూ.2 వేల చొప్పున, మరో ఇద్దరికీ మూడు వేల చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కొండాపూర్ ఏఈ రాజశేఖర్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు డీసీఎల్ లేఅవుట్, మసీద్‌బండ మెయిన్ రోడ్డు, ఎస్‌మార్ట్ నుంచి మైహోం మంగళ అపార్ట్‌మెంట్ వరకు సరఫరా ఉండదన్నారు. మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల వరకు మసీద్‌బండ విలేజ్, ప్రభుపాద టౌన్‌షిప్, రిలయన్స్ అపార్ట్‌మెంట్స్ పరిసరాలు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

గచ్చిబౌలి: మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గచ్చిబౌలి ఏఈ వేణు గోపాల్ ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సెక్రటేరియట్ కాలనీ, మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల వరకు టీఎన్‌జీవోస్ కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

మాదాపూర్‌లో..

మాదాపూర్: చెట్ల కొమ్మలను తొలగించే క్రమంలో 11కేవీ ఫీడర్‌ల పరిధిలో విద్యుత్ అంతరాయం కలుగనుందని ఏఈ శ్రీనివాస్ తెలిపారు. 11 కేవీ హుందాయ్ ఫీడర్ పరిధిలో ఉదయం 9.30 మధ్యాహ్నం నుంచి 2 గంటల వరకు ఎస్‌బిఐ, మాతాభువనేశ్వరీ, యశోదా హాస్పిటల్ తదితర ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందన్నారు. 11 కేవీ అయ్యప్ప సొసైటీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సెక్షన్ ఆఫీస్, హుందాయ్, అయ్యప్పసొసైటీ ప్రాంతం, చంద్రనాయక్‌తాండి తదితర ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు.

చందానగర్ 11 కేవీ ఫీడర్ పరిధిలో..

శేరిలింగంపల్లి: చందానగర్ 11 కేవీ ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తారానగర్ ఏఈ తెలిపారు. ఫీడర్ పరిధిలోని చందానగర్ మెయిన్ రోడ్డు, వేంకటేశ్వరస్వామి టెంపుల్ ఏరియా, చెన్నారెడ్డి హాస్పిటల్, గీతా థియేటర్ ఏరియాల్లో సరఫరా నిలిపివేస్తామన్నారు.

శాంతినగర్ ఫీడర్ పరిధిలో...

శాంతినగర్ 11 కేవీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు. ఫీడర్ పరిధిలోని శాంతినగర్, కడిమి హాస్పిటల్, హుడా కేష్, వెంటాద్రినగర్, జీహెచ్‌ఎంసీ మీ సేవా కేంద్రం రోడ్డు, విద్యా నర్సింగ్ హోమ్ రోడ్డులలో సరఫరా ఉండదన్నారు.

అధికారుల తీరుపై సభ్యుల ఆగ్రహం

- సమస్యల పరిష్కరించాలని డిమాండ్
- వాడీవేడిగా మండల సర్వసభ్య సమావేశం

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నా పట్టించుకోవడంలేదని సభ్యులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గుమ్మడిదల మండల సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం ఎంపీపీ ప్రవీణ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో ఆయా శాఖల అధికారులు నివేదికలను సభకు వివరించారు. అనంతరం పలువురు సభ్యులు మాట్లాడుతూ మండలంలో తీవ్రంగా ఉన్న కాలుష్య సమస్య పరిష్కరించాలని పీసీబీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎటువంటి చర్యలు తీసుకోవడంలేదని వాపోయారు. రైతులకు సబ్సిడీపై విత్తనాలను పంపిణీ చేయాలని సభ్యుడు నాగేందర్‌గౌడ్ డిమాండ్ చేశారు. గ్రామాల్లోని గొర్లు, మేకలు మేతకు అడవుల్లోకి వెళ్తుంటే ఫారెస్టు అధికారులు అడ్డుకోవటం సరైందికాదన్నారు. అదేవిధంగా కోతుల బెడద తీవ్రంగా ఉండటంతో వాటిని నివారించేవిధంగా చర్యలు తీసుకోవాలని సర్పంచ్‌లు అధికారులను కోరారు. మండల కేంద్రంలో ఆధార్ సెంటర్ లేకపోవటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెంటనే ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సభ్యురాలు పార్వతమ్మ రెవెన్యూ అధికారులకు సూచించారు. బొంతపల్లి, గుమ్మడిద, అనంతారం, మంబాపూర్ గ్రామాల పరిధిలలో ఉన్న రసాయన పరిశ్రమల నుంచి రాత్రి సమయంలో వ్యర్థ పదార్థాల ఘాటు వాసనలు వస్తున్నాయని ఎంపీపీ ప్రవీణ, జెడ్పీటీసీ కుమార్‌గౌడ్‌తో పాటు సభ్యులు పీసీబీ ఈఈకి వివరించారు. పరిశ్రమల యజమాన్యాలు రాత్రి సమయంలో కాలుష్య జలాలను బయటకు వదిలేస్తుండటంతో బొంతపల్లిలోని అలుకచెరువు కాలుష్య జలాలతో నిండిపోయిందని సభ్యుడు నాగేందర్‌గౌడ్ వివరించగా స్పందించిన పీసీబీ ఈఈ కుమార్ పాఠక్ పరిశ్రమల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. గుమ్మడిదలలో ఆర్టీసీ బస్‌పాస్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని ఆర్టీసీ అధికారి పోచయ్య తెలిపారు. సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ ప్రవీణ, జెడ్పీటీసీ కుమార్‌గౌడ్ మాట్లాడుతూ సభలో దృష్టికి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, వైస్‌ఎంపీపీ మంజుల, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమస్యలను వివరిస్తున్న సభ్యుడు